క్లుప్తంగా

టీచర్‌కు ప్రతిభా పురస్కారం



ముత్తుకూరు: సహిత విద్య ఉపాధ్యాయుడు కిరణ్‌కుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. గుంటూరులోని ఆంధ్రా క్రైస్తవ కళాశాలలో ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పురస్కార ప్రదానం జరిగింది. కిరణ్‌ను మండల విద్యాశాఖాధికారి మధుసూదన్, హేమసుందర్ మంగళవారం అభినందించారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



బస్టాండ్ వద్ద పోస్టర్ల ప్రదర్శన

పొదలకూరు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఫైర్ ఆఫీసర్ విజయ వరకుమార్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ వినియోగం, దాని వల్ల సంభవించే ప్రమాదాలను వివరించారు. అనంతరం ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు: పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

ఇన్వర్టర్ కొనుగోలుకు రూ.లక్ష విరాళం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఇన్వర్టర్ కొనుగోలుకు రూ.లక్ష విరాళాన్ని దొడ్ల కుటుంబసభ్యులు మంగళవారం అందజేశారు. ఈ మేరకు చెక్కును సీహెచ్‌సీ వైద్యాధికారి పద్మజకు దొడ్ల రుక్మిణమ్మ చారిటబుల్ ట్రస్ట్ తరఫున దొడ్ల కోదండరామిరెడ్డి ఇచ్చారు.

ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపన



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని నాగమాంబాపురం పంచాయతీ విలియమ్స్‌పేటలో ఆటోనగర్ ఏర్పాటుకు శంకుస్థాపనను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆటోనగర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

వైఎస్సార్‌సీపీని మరింత అభివృద్ధి చేయాలి

కోవూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు శక్తి వంచన లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు నెల్లూరులోని తన నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడారు. మహిళల సమస్యలపై ఎప్పటికప్పుడు మాట్లాడేందుకు వీలుగా నియోజకవర్గ మహిళా సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి ముందుకు సాగాలని కోరారు. కోవూరు పట్టణం నుంచి భీమతాటి జ్యోత్స్న, సరిత, బుజ్జమ్మ, లక్ష్మీదేవి, పగడాల సుధ, మండలం నుంచి గాలి జ్యోతి, తిరుపతమ్మ, ఆరిఫా, కట్టా అన్నపూర్ణమ్మ, గంగపట్నం ఉమా, లక్ష్మీకుమారి కవరగిరి శ్రీలత, ధర్మాల ప్రమీలమ్మ చౌటూరు ధనమ్మను కమిటీల్లో నియమించామని చెప్పారు.

కాలుష్య కోరల్లో పచ్చని పల్లెలు

- వరకవిపూడి, మండపం పంచాయతీల్లో దారుణ పరిస్థితులు
- చెట్ల మనుగడ ప్రశ్నార్థకం
- పట్టించుకోని కంపెనీల యాజమాన్యాలు

థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్‌ల కారణంగా పచ్చని పల్లెలు కాలుష్యం కోరల్లో చిక్కుకున్నాయి. వాటి నుంచి బూడిద రూపంలో వెలువడుతున్న కాలుష్య కారక విషవాయువులతో ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కాలుష్య కారక పదార్థాలతో మొక్కలు, చెట్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారిపోయింది.

తోటపల్లిగూడూరు: మండలంలోని వరకవిపూడి పంచాయతీ అనంతపురం గ్రామంలో పవర్ ప్రాజెక్ట్ ఉంది. 1,300 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశారు. దీనికి సమీపంలోనే మరో పవర్ ప్రాజెక్ట్ ఉంది. ఇందులో ఓ పరిశ్రమ నుంచి బూడిద రూపంలో వెలువడుతున్న విష వాయువులు వరకవిపూడి పంచాయతీతో పాటు మండపం పంచాయతీని చుట్టుముడుతున్నాయి. దీంతో సహజ సిద్ధమైన పల్లె వాతావరణం కనుమరుగవుతోంది. స్థానికులు ఆరోగ్యపరమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తోంది.

ఎండుముఖం

థర్మల్ విద్యుత్ ప్రాజెక్ట్‌ల కారణంగా వరకవిపూడి పంచాయతీలోని అనంతపురం, శివరామపురం, మండపం పంచాయతీలోని కాటేపల్లి, సీఎస్‌పురం, గొల్లపాళెం గ్రామాల్లో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి. పెద్ద పెద్ద చెట్లతోపాటు ఇళ్లల్లోని పూల మొక్కలు ఎండుముఖం పడుతున్నాయి.

పచ్చని చెట్లు కళ్లెదుటే ఎండిపోతుండటంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాక పంటలు సైతం సక్రమంగా పండని పరిస్థితులు నెలకొనడంతో రైతన్నలు ఆందోళనలో పడిపోయారు. అరకొరగా పండే పంటలు సైతం నాణ్యత లేక నాసిరకంగా ఉండటంతో నష్టాలను చవిచూస్తున్నారు. యాజమాన్యాలు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వరకవిపూడి పంచాయతీలో ఎండిపోయిన వృక్షాలు



కాలుష్యం కారణంగా మండపం పంచాయతీలో ఎండిపోయిన సవక తోట

ఎండిపోతున్నాయి



ఓ ప్రాజెక్ట్ నుంచి బూడిద రూపంలో కాలుష్యం విడుదలవుతుండటంతో పంటలు, పూల మొక్కలు, భారీ వృక్షాలు నిలువునా ఎండిపోతున్నాయి. కాలుష్యంతో స్థానికులు వివిధ రోగాల బారిన పడుతున్న పరిస్థితి ఎదురవుతోంది.

– ఉప్పల శంకరయ్యగౌడ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, అనంతపురం, వరకవిపూడి పంచాయతీ

యాజమాన్యాలు స్పందించాలి



ఎలాంటి కాలుష్యం ఉండదని, ప్రజలకు ఇబ్బందులు ఉండవని కంపెనీల యాజమాన్యాలు నమ్మబలికాయి. అయితే కాలుష్యం కారణంగా పచ్చని పల్లెల రూపురేఖలు మారిపోయాయి. ఇప్పటికైనా యాజమాన్యాలు స్పందించి గ్రామాలను రక్షించే చర్యలు తీసుకోకపోతే ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపట్టడం ఖాయం.

– కాల్తిరెడ్డి సుబ్బారావు, సర్పంచ్, మండపం పంచాయతీ

ప్రభుత్వ కాలేజీలో విద్యార్థులకు అభినందన



ప్రతిభ చూపిన విద్యార్థులతో అధ్యాపకులు

పొదలకూరు: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకుల ఉత్తమ బోధన వల్ల ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు అండగా ఉంటా

ఇందుకూరుపేట: కోవూరు షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం, కార్మికుల బకాయిల కోసం భవిష్యత్తులో ఏ కార్యక్రమాన్ని చేపట్టినా తాను ప్రాతినిధ్యం వహించి, వారికి అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగ రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కోటిరెడ్డి, ఉపాధ్యక్షుడు అట్లూరి వెంకటరమణనాయుడ్ని మంగళవారం ఆయన సత్కరించారు. పార్టీ నేత షబ్బీర్ పాల్గొన్నారు.



కోటిరెడ్డిని సత్కరిస్తున్న నరేంద్రరెడ్డి

నవధాన్యాలను సాగుచేయాలి



మాట్లాడుతున్న మునిరత్నం

కోవూరు: నవధాన్యాన్ని సాగుచేయాలని ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం మునిరత్నం కోరారు. ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం అనే అంశంపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వరి సాగు అనంతరం అంతర పంటలు, నవధాన్యాలను సాగుచేయడం ద్వారా భూమి సారవంతమవుతుందని చెప్పారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఏడీ సుజాత, ఏఓ ఇందిరావతి, సుబ్బరాజు, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

కోవూరు: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. సీడ్ డెవలప్‌మెంట్, కిచెన్ గార్డెన్, న్యూట్రీ గార్డెన్ వేసేందుకు ఆసక్తి గల వారిని గుర్తించాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ అడిషనల్ డీపీఎం మునిరత్నం, ఏడీఏ సుజాత, ఏఓ ఇంద్రావతి, ఏపీఎం సుబ్బరాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ



కోవూరు: స్కిల్ డెవలప్‌మెంట్‌పై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్డీఏ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మొదటి బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. కేవీకేకు చెందిన సుజాతరెడ్డి, ఏపీఎంలు నాగేంద్రప్రసాద్, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీలో అపశ్రుతి

- వ్యక్తికి గాయాలు

విడవలూరు: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని స్థానిక అంబేడ్కర్‌నగర్ కాలనీలో ఆయన విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ క్రమంలో అంబేడ్కర్ చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఏర్పాటు చేసి గ్రామంలో ర్యాలీని రాత్రి నిర్వహించారు. బాణసంచాను ట్రాక్టర్‌లో ఉంచి కాల్చే క్రమంలో నిప్పురవ్వలు పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే బాణసంచా మొత్తం కాలి బూడిదైపోయింది. దీంతో ట్రాక్టర్ ట్రక్కులో కూర్చున్న గంగపట్నం సునీల్ గాయపడి స్పృహ కోల్పోవడంతో నెల్లూరులోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. త్వరలోనే కోలుకుంటారని డాక్టర్లు తెలియజేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేష్ చెప్పారు.

ముదిగేడులో ఎమ్మెల్యే పర్యటన

పొదలకూరు: సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మంగళవారం మండలంలోని ముదిగేడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్లను ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇనుకుర్తి సర్పంచ్ పెదమల్లు శ్రీనివాసులురెడ్డి సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు టి.మస్తాన్‌బాబు, అక్కెం సుధాకర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షాపుల వేలం వాయిదా

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ గోపాల్‌రెడ్డి, ఉక్కాల రాజేశ్వరమ్మ, బైనా హేమలత, ఏఎస్సార్ కాంప్లెక్స్‌లకు సంబంధించిన గదులను అద్దెకు ఇచ్చేందుకు మంగళవారం నిర్వహించాల్సిన వేలాన్ని వాయిదా వేశారు. ఈ మేరకు వివరాలను నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ తెలియజేశారు. అనివార్య కారణాలతో వాయిదా పడిందని, తిరిగి ఈ నెల 21న నిర్వహించనున్నామని వెల్లడించారు.

మొలకపోలేరమ్మకు చద్ది సమర్పణ

ఇందుకూరుపేట: మండలంలోని కొమరికలో కొలువైన మొలకపోలేరమ్మకు చద్దిని సమర్పించారు. అమ్మవారికి రెండు మంగళవారాలు చద్దిని సమర్పించిన అనంతరం మూడో మంగళవారాన జాతరను నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలను నిర్వహించి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దీంతో గ్రామంలో సందడి నెలకొంది.

డిగ్రీ పరీక్షలకు 572 మంది గైర్హాజరు

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో మంగళవారం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 572 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామ్స్ నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 9,433 మందికి గానూ 8,861 మంది హాజరై 572 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు.

రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రుణాలకు మే ఐదులోపు ఎస్సీలు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీహరి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో 25 మందిని ఎంపిక చేయనున్నామని, వివరాలకు తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: చెట్టు కొమ్మ పడటంతో గాయపడిన మండలంలోని కసుమూరు గ్రామానికి చెందిన బిరుదువోలు చిన్నయ్య (54) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. కసుమూరు గ్రామానికి చెందిన చిన్నయ్య కొన్నిరోజుల క్రితం నివాసం వద్ద ఉండగా చెట్టు కొమ్మ విరిగి పైన పడటంతో గాయపడ్డాడు. తొలుత నెల్లూరు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. అక్కడ నుంచి జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ చనిపోయాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు

తోటపల్లిగూడూరు: మండలంలోని చెన్నపల్లిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1985 – 86లో పదో తరగతి చదివిన వారు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులైన చంద్రశేఖర్, మీనమ్మను ఘనంగా సన్మానించారు. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాయిప్రసాద్, పూర్వ విద్యార్థులు విజయ్‌మోహన్, దుంపల ఏసోబు, దయాకర్, చెంచునాయుడు తదిరులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



పొదలకూరు: నవమి వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీరామమందిరం వద్ద మంగళవారం రాత్రి వైభవంగా పార్వేట మహోత్సవం జరిగింది. తుమ్మల పెంచలయ్య – కొండలమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. తుమ్మల కుటుంబీకులు శ్రీరామ లక్ష్మణులు, సీతాదేవి, భరతుడు, ఆంజనేయస్వామి వేషధారణలో ఊరేగింపుగా స్థానిక శివాలయం వద్దకు చేరుకున్నారు. ఉత్సవం తర్వాత సీతారాముల గ్రామోత్సవం జరిగింది. రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన బృందావనం ప్రోగ్రామ్ ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో తుమ్మల శ్రీనివాసులు, రమణయ్య, ప్రసాద్, శ్రీహరి, నరేంద్ర, వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

పోషక విలువలపై అవగాహన అవసరం



కొడవలూరులో అవగాహన ర్యాలీ



కొడవలూరు: రేగడిచెలికలో..



కొడవలూరు: రామాపురంలో..



మనుబోలు: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

కొడవలూరు: పోషక విలువలపై గర్భిణులకు అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల సూచించారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా కొడవలూరులో మంగళవారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ఆకుకూరలు, పాలు, గుడ్లు, కొర్రలు, జొన్నలు, సజ్జలు, పండ్లు ఆహారంలో భాగం కావాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు బాలసంజీవని కిట్లను పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు యాస్మిన్, రమీజా, నాగరాజమ్మ, కామేశ్వరి, శాంతి, ఆఫ్రిన్ పాల్గొన్నారు.

⇨ బిడ్డకు రెండున్నరేళ్లు నిండేంత వరకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగభూషణమ్మ సూచించారు. మండలంలోని రేగడిచెలిక గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యకర్తలు అమరావతి, విజయలక్ష్మి, రాజేశ్వరి, కృష్ణవేణి, చెంచమ్మ పాల్గొన్నారు.

⇨ మండలంలోని యల్లాయపాళెం మజరా రామాపురం – 2 అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో సురేఖ, పంచాయతీ కార్యదర్శి హరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

⇨ **కోవూరు:** పౌష్టికాహారం లోపిస్తే అనారోగ్య సమస్యలొస్తాయని వైద్యుడు కరుణాకర్ పేర్కొన్నారు. అట్ల కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని ఇనమడుగు ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించారు. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

⇨ **మనుబోలు:** పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని కొలనకుదురు దళితవాడ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలున్న ఆహార పదార్థాలను ఎలా తయారు చేసుకోవాలో చూపించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సీతారామమ్మ, అంగన్‌వాడీలు రాధ, వెంకటరమణమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ కార్మికులు విధులను మంగళవారం నిర్వర్తిస్తుండగా, లారీ ఢీకొనడంతో ట్రాక్టర్ డ్రైవర్ సుమంత్, దాసయ్య గాయపడ్డారు. నెల్లూరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరిని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శించారు. వైద్యసేవలపై ఆరాతీసి కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతి, బుచ్చిరెడ్డిపాళెం పట్టణ, రూరల్ కన్వీనర్లు షాహుల్, చెర్లో సతీష్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ప్రసన్నను కలిసిన నేతలు

కోవూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమితులైన మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ కోవూరు మండల నేతలు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా అభినందనలను తెలియజేశారు. డీఎల్డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అహ్మద్, జెడ్పీటీసీ శ్రీలత, పడుగుపాడు సర్పంచ్ లక్ష్మీనారాయణ, భాస్కర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అతిపల్లి అనూప్‌రెడ్డి, నావూరు శ్రీనివాసులు, రాజేష్, శ్రావణ్, సూర్య తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ సమస్య తీరేదెన్నడో..





ట్రాఫిక్ స్తంభించేలా నరుకూరు సెంటర్‌లో అడ్డదిడ్డంగా నిలిపిన వాహనాలు

తోటపల్లిగూడూరు: నరుకూరు సెంటర్ మండల వాణిజ్య కేంద్రం. ఇక్కడ వాహనాల రద్దీతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. నెల్లూరు నగరానికి 6 కిలోమీటర్ల దూరంలోనే ఈ సెంటర్ ఉంటుంది. ఇది తోటపల్లిగూడూరు మండలం, నెల్లూరు రూరల్, ఇందుకూరుపేట మండలాలకు కూడలిగా ఉంది. కోడూరు బీచ్, తోటపల్లిగూడూరు మండల కేంద్రానికి ఈ సెంటర్ నుంచే వాహనాలు రాకపోకలు సాగించాల్సి ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య కొంత కాలంగా ప్రజలను వేధిస్తోంది. సెంటర్‌లోని దుకాణాలు ముందుకు చొచ్చుకొని వస్తుండటంతో డబుల్ రోడ్డు కాస్తా సింగిల్ రోడ్డుగా మారిపోయింది. అంతే కాక ఆటోలు, ప్రయివేట్ వాహనాలను నడిరోడ్డుపైనే అడ్డదిడ్డంగా నిలుపుతున్నారు. అటు అధికారులు.. ఇటు పోలీస్ శాఖ ట్రాఫిక్‌పై పెద్దగా దృష్టి సారించడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.